నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 27 నవంబర్ 2024 RANGAREDDY

## 3న మరో ఫ్లై ఓవర్ ప్రారంభం!

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఆర్‌డీపీ) ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా రూ.5112.36 కోట్ల అంచనా వ్యయంతో 47 ప్రాజెక్టులు చేపట్టింది. అందులో భాగంగా రూ. 629.30 కోట్లతో చేపట్టిన ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఆరు లేన్లతో 119 పిల్లర్లతో 4.08 కిలోమీటర్ల మేర చేపట్టిన భారీ ఫ్లై ఓవర్‌ను వచ్చే నెల 3న ప్రారంభించేందుకు జీహెచ్ఎంసీ సన్నాహాలు చేస్తున్నది. ఇందులో భాగంగానే మంగళవారం కమిషనర్ ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్‌వర్క్స్ ఈడీ మయాంక్ మిట్టల్ ఇతర అధికారులతో కలిసి ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. ఈ నెల 30 నాటికి సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి మొత్తం 17 ఆస్తులు సేకరించాలని, ప్రస్తుతం పని జరిగేందుకు 5 ఆస్తులు సత్వరమే సేకరణ చేసిన పక్షంలో.. పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని సీఈ దేవానంద్ కమిషనర్‌కు వివరించారు. సమస్య పరిష్కారానికి జోనల్ టౌన్‌ప్లానింగ్ అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని, నష్ట పరిహారం చెల్లింపునకు సంబంధిత ప్రతిపాదనను త్వరగా పంపిస్తే వెంటనే మంజూరు చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.




## రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

వికారాబాద్, నవంబర్ 26 : రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలు, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు వ్యవసాయ, రైతు, కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమోల్ల కృష్ణయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వై.గీత, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వై.మహేందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి.

# దీక్షాదివస్‌ను.. విజయవంతం చేద్దాం..

**2 వేల మందితో దీక్షాదివస్..**

**అందరికి పదవులు రావు, కొందరికి ఆలస్యంగానైనా న్యాయం జరుగుతది**

**అందరూ సమన్వయంతో పని చేయండి**

**సన్నాహక సమావేశంలో పార్టీ శ్రేణులకు సూచించిన వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి**

వికారాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): మలిదశ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ తెలంగాణ తెచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అని ఆమరణ నిరాహార దీక్షకు దిగి ఈ నెల 29కి సరిగ్గా పదిహేనేండ్లు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రతి ఏటా నవంబర్ 29న దీక్షా దివస్‌గా నిర్వహిస్తూ వస్తున్నది. దీక్షాదివస్ కార్యక్రమాన్ని ఈసారి అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆదేశాలతో జిల్లా కేంద్రంలో దీక్షాదివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకుగాను పార్టీ జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. ఇందులో భాగంగా మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో నాలుగు నియోజకవర్గాల్లోని ముఖ్య నాయకులు, మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ మండలాల అధ్యక్షులతో దీక్షాదివస్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి 500 నుంచి 600 మంది చొప్పున 2 వేల మందితో దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ నెల 29న వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న దీక్షాదివస్ కార్యక్రమానికి అందరూ హాజరై తెలంగాణ తల్లికి పూలమాల వేసి, అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలన్నారు. దీక్షాదివస్ రోజున ఉద్యమ నేత కేసీఆర్ ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి డాక్యుమెంటరీని దీక్షాదివస్ రోజున ప్రదర్శించనున్నట్లు నవీన్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో రాష్ట్రాన్ని సాధించి, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టడంతోపాటు ఉద్యోగ నియామకాలు చేపట్టి సబ్బండ వర్ణాల సంక్షేమం నిమిత్తం రైతు బీమా, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అన్నింటిలోనూ వైఫల్యం చెందిందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అందరికీ పదవులు రావని, పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తప్పనిసరిగా ఆలస్యంగానైనా న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజయ్‌కుమార్, నాగేందర్ గౌడ్, శ్రీశైల్ రెడ్డి, శుభప్రద్‌పటేల్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్




రంగారెడ్డి జిల్లా సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం..

**ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మభ్యపెట్టారు..**

**ఒక్క సంక్షేమ పథకం కూడా సరిగ్గా అమలు కాలేదు..**

**ఫార్మాసిటీ పేరుతో రైతులను గోస పెడుతున్నది..**

**ఈ నెల 29న జరిగే దిక్షా దివస్‌ను విజయవంతం చేద్దాం**

**సన్నాహక సమావేశంలో మాజీ మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ**

శంషాబాద్ రూరల్, నవంబర్ 26 : 'కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల రాష్ట్రం దివాలా తీస్తున్నది.. ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మభ్యపెట్టారు.. ఒక్క సంక్షేమ పథకం కూడా సరిగ్గా అమలు కాలేదు.. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి..' అని మాజీ మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 29న జరిగే దిక్షా దివస్‌ను విజయవంతం చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సర్కార్ ఫార్మాసిటీ పేరుతో కొడంగల్ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీల భూములను లాక్కునేందుకు రైతులను గోస పెడుతున్నదన్నారు. రేవంత్‌రెడ్డి తన సోదరులు కలిసి అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో 144సెక్షన్ విధించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ సాధించిన ఉద్యమకారుడిగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని, పదేండ్లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి సబ్బండ వర్ణాల మెప్పు పొందిన మహానేత కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల మోసాన్ని ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు వివరించారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

## కేసీఆర్ వల్లే తెలంగాణ వచ్చింది..



**బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దిక్షాదివస్ సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అంటూ నాడు దీక్ష చేపట్టడంతోనే తెలంగాణ ప్రకటన వచ్చిందన్నారు. దీంతో 2014లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిందన్నారు. 1969 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది తెలంగాణ బిడ్డలు ప్రాణాలు అర్పించారని తెలిపారు. ఈ నెల 29న ఉదయం 8 గంటలకు గ్రామాలు, వార్డుల్లో బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించడంతో పాటు 10 గంటలకు శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి కార్యాలయంలో దీక్షాదివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటరమణరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, తీగల విక్రంరెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎమ్మె సత్యనారాయణ, శంషాబాద్ మాజీ ఎంపీపీ సాయమ్మాశ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, శంషాబాద్ కౌన్సిలర్ భారతమ్మ, దిద్యాల శ్రీనివాస్, దేశమోల్ల ఆంజనేయులు, కొన్నమొల్ల శ్రీనివాస్, సాయిబాబా, గంటి చరణ్ పాల్గొన్నారు.



**మున్సిపాలిటీలను వెంటాడుతున్న నిధుల కొరత**

- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- జిల్లాలోని 13 మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి
- స్టేట్ ఫైనాన్స్, 15వ ఫైనాన్స్ కింద అందని నిధులు
- పట్టణ ప్రగతి నిధుల జాడేలేదు

# నిధుల్లేవ్!

రంగారెడ్డి, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని మున్సిపాలిటీలను నిధుల కొరత వెంటాడుతున్నది. నగరం చుట్టూ విస్తరించి ఉన్న మున్సిపాలిటీల్లో అభివృద్ధి ఆశించిన మేరకు జరుగడం లేదు. పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు... కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు గత సంవత్సర కాలంగా జాడ లేవు. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు మాత్రమే నియోజకవర్గ అభివృద్ధికి నిధులను హెచ్ఎండీఏ ద్వారా అరకొరగా తీసుకొస్తున్నారు. మరోవైపు పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీలకు రావాల్సిన నిధులు కూడా నిలిచిపోయాయి. దీంతో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు మాత్రమే కనిపిస్తున్నాయి.

**భవన నిర్మాణాలు, పన్నుల వసూళ్లే ప్రధాన ఆధారం..**

జిల్లాలో 13 మున్సిపాలిటీలు, రెండు కార్పొరేషన్లు ఉన్నాయి. ఇవన్నీ హైదరాబాద్ నగరం చుట్టే ఉన్నాయి. ఇందులో పెద్దఅంబర్‌పేట్, తుర్కయాంజాల్, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, తుక్కుగూడ, శంషాబాద్, రాజేంద్రనగర్, మణికొండ వంటి మున్సిపాలిటీలు హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్నాయి. గతంలో ఈ మున్సిపాలిటీలు అభివృద్ధిలో దూసుకుపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఈ మున్సిపాలిటీల్లో చేపడుతున్న భవన నిర్మాణాల అనుమతుల ద్వారా వచ్చే నిధులు, పన్నుల వసూళ్ల ద్వారా సుమారు రూ.40లక్షల నుంచి రూ.50 లక్షలు వచ్చే నిధులతో సిబ్బంది వేతనాలు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

**ఊసేలేని పట్టణ ప్రగతి..**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి కింద ఒక్కో మున్సిపాలిటీకీ ప్రతి నెలా నిధులు కేటాయించేవారు. ఈ నిధులతో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు వంటి వాటికి ఉపయోగించి పన్నులు, భవన నిర్మాణాల అనుమతుల ద్వారా వచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పట్టణ ప్రగతి అన్న ఊసే లేదు.

**ముందుకు సాగని మున్సిపల్ అభివృద్ధి..**



గత ఏడాది కాలంగా ఆమనగల్లు మున్సిపాలిటీకి సరైన నిధులు రాక అభివృద్ధి ముందుకు సాగడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క అభివృద్ధి పనిని చేపట్టకపోవడం సిగ్గుచేటు.

– వీరయ్య, ఆమనగల్లు మున్సిపాలిటీ

**అభివృద్ధికి నిధులు కేటాయించాలి..**



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి ఏడాది కాలంగా నిధులు రాలేదు. అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మున్సిపాలిటీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉన్నది. తాగునీటి సమస్య ఉత్పన్నమవుతున్నది. పార్కులు అధ్వానంగా మారాయి. రోడ్లు గుంతలమయంగా మారిన కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ నిధులు కేటాయించాలి.

– గుంటి కిరణ్, ఇబ్రహీంపట్నం

# అర్హులందరూ ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలి

**వికారాబాద్‌లో 2కే రన్..**

**జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్**

వికారాబాద్, నవంబర్ 26 : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఎస్పీ నారాయణరెడ్డిలతో కలిసి 2కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరి రీవిజన్ 2025లో భాగంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటు హక్కు ఆయుధం వంటిదని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు గాను ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా తహసీల్దార్, బీఎల్‌వోల దగ్గర, ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఓటు అమూల్యమైనదని, 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి ఏంఏ సత్తార్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.




2కే రన్‌లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు